క్లుప్తంగా

నేటి నుంచి నరసింహస్వామి కల్యాణోత్సవాలు



లక్ష్మీ నరసింహస్వామి

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామంలో ఉన్న శ్రీకుంతీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మంగళవారం వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు వైకానస ఆగమ ప్రకారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో శుక్రవారం మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి సదస్యం, మంగళవారం ఉదయం పూర్ణాహుతి, చక్రస్నానం రాత్రి స్వామికి పుష్పయాగం నిర్వహిస్తామని వివరించారు. పుష్పయాగం తరువాత ఆలయం వద్ద కోలాటం జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పెన్మత్స బుద్ధరాజు

యలమంచిలి: పోడూరు మండలం జున్నూరు గ్రామానికి చెందిన ఉద్దరాజు రాఘవేంద్రరాజు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆయన అనారోగ్య పరిస్థితి తెలిసి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు స్పందించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంబంధిత చెక్కును గురువారం ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మత్స బుద్ధరాజు, జున్నూరు సొసైటీ మాజీ అధ్యక్షులు పెన్మత్స సుబ్బరాజు చేతుల మీదుగా రాఘవేంద్రరాజుకు అందజేశారు.

వైఎస్సార్ సీపీ నేత చందు మృతి



నల్లూరి చందు(48)

పెనుగొండ: ఆచంట వైఎస్సార్ సీపీ యువజన విభాగ నేత నల్లూరి చందు(48) గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొనేవారు. చందుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతిపై మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి, సర్పంచ్‌లు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి శ్రీరామ్, గణేషుల శేషవేణి సుబ్బారావు, బోడపాటి బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యులు చిలుకూరి భవానీ నరేంద్ర, యల్లమెల్లి బేబీ రాజేష్, నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ, నంబూరి రాజా, కుక్కల కిరణ్, దొమ్మేటి రాంబాబు, కాంగ్రేగుల కనకరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పోషక విలువలున్న ఆహారం అందించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 జీవీ సూర్యనారాయణ

యలమంచిలి: మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు పోషక విలువలున్న సమతుల ఆహారాన్ని అందించాలని ఎంఈఓ-2 జీవీ సూర్యనారాయణ కోరారు. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు పోడూరు మండలం జున్నూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మండలంలోని అన్ని పాఠశాలల డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం కుక్ కమ్ హెల్పర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ-2 జీవీ సూర్యనారాయణ కోర్సు డైరెక్టర్‌గా, టీచర్ కొల్లాబత్తుల సూర్యకుమార్ రిసోర్స్ పర్సన్‌గా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం సరఫరా చేస్తుందని, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన పోషక విలువలు కలిగిన సమతుల ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం వంటల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.శివజ్యోతి, సీఆర్‌పీ కాటం భారతి తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీ గోడు వినేదెవరు?

- కాలుష్య కోరల్లో గోస్తనీ డ్రెయిన్, జీఅండ్‌వీ కెనాల్
- పట్టించుకోవాలంటూ అధికారులు, నాయకులకు రైతుల మొర



జుత్తిగ వద్ద ముంపునకు గురైన పంట పొలాలు(ఫైల్)



పెనుమంత్ర, ఎస్.ఇల్లిందలపర్రు వద్ద పేరుకుపోయిన కిక్కిస, చెత్త



గోస్తనీ డ్రెయిన్‌ను డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్న దృశ్యం



పెనుమంత్ర వద్ద జీఅండ్‌వీ కెనాల్

పెనుమంత్ర: గత మూడు దశాబ్దాలుగా గోస్తనీ డ్రెయిన్, జీఅండ్‌వీ కెనాల్ పరివాహక ప్రాంత రైతుల పంట పొలాలు ముంపుబారిన పడుతున్నా వారి గోడు వినే నాథుడు లేక ప్రతిఏటా పంటు ముంపుబారిన పడి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. గోస్తనీ డ్రెయిన్‌ను 35 ఏళ్ల క్రితం అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి హయాంలో ప్రపంచ బ్యాంకు, నాబార్డు నిధులతో మురుగుకాలువలు, పంటకాలువను ఆధునీకరించారు. అందులో భాగంగా గోస్తనీ డ్రెయిన్ పూర్తిగా పూడికతీత పనులు చేశారు. ఆ తర్వాత గోస్తనీ డ్రెయిన్‌ను పట్టించుకునే వారు లేరు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో గోస్తనీ పంటకాలువ ఆధునీకీకరణకు నిధులు తీసుకువచ్చి పనులు ప్రారంభించినా ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం ఆ కాలువ పనులను నిర్వీర్యం చేయడంతో అరకొర పనులతోనే నిధులు దుర్వినియోగమై కాలువ ప్రక్షాళన కాలేదు.

అక్రమణలు, చెత్తతో నిరంతర సమస్య

గోస్తనీ డ్రెయిన్ పూర్తిగా ఆక్రమణలకు గురి అయ్యింది. అలాగే గ్రామ పంచాయతీల చెత్తను గోస్తనీలో వేసి, డంపింగ్ యార్డులుగా వినియోగిస్తున్నారు. అనేక చోట్ల డ్రెయిన్ గట్టును సైతం ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించడంతో గోస్తనీ డ్రెయిన్ నీటి ప్రవాహం పూర్తిగా స్తంభించిపోయింది. అలాగే కిక్కస, చెత్త దట్టంగా పెరిగి వర్షాకాలం మురుగునీరు కిందకు వెళ్లకపోవడంతో సార్వాసాగులో రైతులు రెండు, మూడు పర్యాయాలు నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పంటల సమయంలో కూడా ఒక మోస్తరు వర్షానికి డ్రెయిన్ పొంగి, పండిన పంట నీటిపాలు అవుతుంది. దీంతో గత 20 ఏళ్లుగా రైతులు కన్నీటి కష్టాలతోనే వ్యవసాయం నెట్టుకొస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం కూడా గోస్తనీ డ్రెయిన్ ముంపుబారిన పడటంతో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ముంపును పరిశీలించడానికి ఎస్.ఇల్లిందలపర్రు గ్రామానికి వచ్చిన నీటి పారుదలశాఖా, వ్యవసాయశాఖ మంత్రులు గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ వేల్పూరు నుంచి పెనుమంత్ర వరకు గోస్తనీ ప్రక్షాళనకు ఈ వర్షాకాలంలోపే చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. అయితే ఆహామీలు ప్రతిపాదనలతోనే సరిపెట్టారే తప్పా ఇప్పటి వరకు గోస్తనీ డ్రెయిన్‌పై ఎటువంటి పనులు చేపట్టలేదు.

నిధుల మంజూరేది?

గోస్తనీ డ్రెయిన్ ఆధునీకీకరణకు రూ.11.5 కోట్లతో నా బార్డు నిధులతో పూడిక తీస్తామని చెప్పినా ఇప్పటి వరకు నిధులు కూడా మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో గోస్తనీ పరివాహక ప్రాంతంలో రైతులకు ఈ ఏడాది కూడా గోస్తనీ ముంపు తప్పేటట్లు లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు పవిత్ర గోస్తనీ నదిగా ఉండే భక్తులు భావించి పుణ్యస్నానాలు చేశారు. అయితే ఇప్పుడు కాలుష్య కోరల్లో చిక్కుకుని ఈ పరిసర ప్రాంతాల్లో వెళ్లడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది.

ఈ ఏడాది ముంపే



వర్షాకాలంలో గ్రామానికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు గోస్తనీని ఈ వర్షాకాలం లోపే పూడిక తీస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు కనీసం తూడు తొలగించే పనులు కూడా చేపట్టలేదు. నాట్లు వేయాలో? లేదో? అర్థం కావడం లేదు.

– కర్రి శంకర శ్రీరామారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు, ఎస్ ఇల్లిందలపర్రు

ప్రతి ఏటా తీవ్రంగా నష్టం



ప్రతీ ఏటా సార్వా సాగు ప్రారంభంలోనే రెండు, మూడు సార్లు నాట్లు వేయాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో ఎంతోకొంత నష్ట పరిహారం అందించేవారు. ఈ ఏడాది ఆ పరిస్థితి కూడా కానరాలేదు. ఈ పరిస్థితుల్లో నారుమడులు పోయాలో?లేదో?పాలుపోవడం లేదు. – అంగర వీరవెంకట నాగరాజు, కౌలు రైతు, పెనుమంత్ర

రూ. 9 లక్షల మంజూరు

గోస్తనీ డ్రెయిన్‌లో 18 కిలోమీటరు నుంచి 37వ కిలోమీటరు వరకు తూడు తొలగించేందుకు కెమికల్ స్ప్రే చేయించడానికి ఈ ఏడాది రూ.9 లక్షలు నిదులు మంజూరు అయ్యాయి. కొద్ది రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.

– పి.వివేకానంద, ఏఈఈ, అత్తిలి

నరసాపురంలో సమృద్ధిగా మంచినీటి సరఫరా

నరసాపురం: వేసవిలో రెండుపూటలా కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట చెప్పారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాలువలకు నీరు వదిలే వరకూ కుళాయి చెరువులో మంచినీటి నిలువ సరిపడగా ఉందన్నారు. వేసవి మొత్తం రెండు పూటలా మించినీరు అందించడానికి ఎలాంటి ఇబ్బందిలేదని పేర్కొన్నారు. శివారు ప్రాంతాలకు ట్రాక్టర్ ద్వారా నీరందిస్తున్నామన్నారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే తెలియజేయాలని సూచించారు. క్లోరినేషన్ పక్రియ కూడా సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



రిటైర్డ్ టీచర్ మాడభూషి కృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

యలమంచిలి: పాలకొల్లు శాఖ గ్రంథాలయంలో గత 40 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పర్యావరణ దినోత్సవ నేపథ్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రంథాలయాధికారి వి.శాంతకుమారి మాట్లాడుతూ వేసవి తరగతుల్లో విద్యార్థులకు ఆటపాటలతో కూడిన కథలు, యోగా శిక్షణ, అల్లికలు, పర్యావరణ హిత బొమ్మల తయారీ, చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, నీతి కథలు, దేశ భక్తి గీతాలు, వ్యక్తిగత క్రమశిక్షణ, చదరంగం, క్యారమ్ తదితర అంశాలు బోధించినట్లు వివరించారు. యోగా గురువు కెవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ తరగతి గదిలో చురుగ్గా ఉండాలంటే యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం రిటైర్డ్ టీచర్ మాడభూషి కృష్ణప్రసాద్‌ను పుర ప్రముఖులు సత్కరించారు. కార్యక్రమంలో నరసింహారావు, యర్రంశెట్టి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

యలమంచిలి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు కోరారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం కనకాయలంక గ్రామంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషి మనుగడకు అవసరమైన ఆక్సిజన్ అందించే మొక్కలను రక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె గంగాధరరావు, ఎంఎల్‌హెచ్‌పీ వై.రాధ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని సంరక్షించాలి

నరసాపురం: పర్యావరణాన్ని మనం సంరక్షిస్తే అది మనల్ని కాపాడుతుందని నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిజి.వరలక్ష్మి అన్నారు. గురువారం వైఎన్ కళాశాలలో మండల న్యాయసేవాసంస్థ, కళాశాల సామాజికసేవా విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణదినోత్సవం సందర్భంగా కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం జడ్జి వరలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం మంచి మార్గమన్నారు. కార్యక్రమంలో వైఎన్ కళాశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడం అలవాటుగా చేసుకోవాలని తహసీల్దార్ అయితం సత్యనారాయణ సూచించారు. నరసాపురం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ నేపథ్యంలో కార్యలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండలో..



యలమంచిలి: పాలకొల్లులో జీవీఎస్‌వీఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పెనుగొండ: ప్రకృతిని పరిరక్షించుకోవాలసిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆచంట, పెనుగొండలో మొక్కలు నాటడాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, కేతా మీరయ్య, కొండవీటి వెంకటరమణ పాల్గొన్నారు. వడలి పంచాయతీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. గురువారం సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంగర వరప్రసాద్, మేకా శివయ్య, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

ఆలమూరులో

పెనుమంత్ర: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చైర్ పర్సన్ గంటా పద్మశ్రీప్రసాద్ గురువారం ఆలమూరు పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.సూర్యభాస్కరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పలివెల ఆశాలత, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షుడు తేతలి వెంకట రామారెడ్డి, కడలి ఏడుకొండలు పాల్గొన్నారు.



యలమంచిలి: కనకాయలంకలో మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు

పాలకొల్లులో..

యలమంచిలి: పాలకొల్లు పట్టణ పరిధిలోని జీవీఎస్‌వీఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ మనిషి తన కార్యక్రమాల ద్వారా పర్యావరణానికి ఎంతో నష్టం చేస్తున్నాడన్నారు. అనంతరం విద్యార్థులతో పకృతి ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటారు. అలాగే పాలకొల్లు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ ఉద్యోగులంతా ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురువారం పలు రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధు కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రామకృష్ణ, టౌన్ ఏఈ ఎస్కే బాబ్జి పాల్గొన్నారు.



పెనుగొండ: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పితాని



నరసాపురం: వైఎన్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి వరలక్ష్మి



పెనుమంత్ర: ఆలమూరులో మొక్కలు నాటుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

పెనుగొండ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



బాదంపూడి ఆనందకుమార్



కొండవీటి ఎస్‌జీఎస్ ఆర్ఎన్ ఆదిత్య

పెనుగొండ: మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో ఇద్దరికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభ అవార్డులు ప్రకటించిందని ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనరల్ కేటగిరిలో బాదంపూడి ఆనందకుమార్, కొండవీటి ఎస్‌జీఎస్ఆర్ఎన్ ఆదిత్యలను ప్రతిభా అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులను పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ తదితరులు అభినందించారు.

మాల మహానాడు కమిటీలు బలోపేతం చేయాలి

పెనుగొండ: మాల మహానాడు కమిటీలు బలోపేతం చేయడానికి నాయకులు కృషి చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. గురువారం సిద్ధాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మాదిగలను విడదీసి వర్గీకరణ చేసి అమలు కాని హామీలు ఇచ్చి నట్టేట ముంచారన్నారు. దీని ఫలితంగా అందరూ నష్టపోతున్నారన్నారు. వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకు వచ్చి అసెంబ్లీలో ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ చేయడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని , దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో నక్కా గోపి శాంతి కుమారి, అమల తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ రోడ్డు కోసం భూసేకరణ

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో భూ సేకరణ కార్యక్రమం ప్రారంభమైందని ఇన్‌చార్జి తహసీల్దార్ ఫరూక్ గురువారం విలేకరులకు తెలిపారు. సర్వే నంబర్ 2131 నుంచి సర్వే నెంబర్ 2181(ఈ)లలో భూ సేకరణకు గెజిట్ జారీ చేశారని తెలిపారు. ఈ గెజిట్ అన్ని దినపత్రికల్లో మే 22న ప్రచురితమైందన్నారు. ప్రచురించిన రోజు నుంచి 21 రోజుల్లోపు అభ్యంతరాలుంటే ఉంటే భూసేకరణ అధికారి, జాయింట్ కలెక్టర్‌కు ఈ నెల 14లోపు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

మట్టిని అక్రమంగా తోలేస్తున్నా పట్టించుకోరా?



సొంత స్థలంలో మట్టిని పూడ్చుకుంటున్న జనసేన నాయకుడు

భీమవరం అర్బన్: పట్టణంలోని దిరుసుమర్రు రోడ్డులోనికి జీ అండ్ వీ కెనాల్ లాకుల వద్ద నుంచి దిరుసుమర్రు వరకు ఛానల్‌లో రూ. 14 లక్షలతో మట్టి పూడిక తీత పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. అయితే ఛానల్ ఇరువైపుల పేరుకుపోయిన సిల్టును పొక్లెయిన్‌ల సహాయంతో ఇరువైపులా వేశారు. అయితే ఆర్ అండ్ బీ రోడ్డు పక్కన వేసిన మట్టిని యనమదుర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు తన సొంత స్థలంలో జేసీబీ, మట్టి ట్రాక్టర్లతో పూడ్చుకుంటున్నారు. ట్రాక్టర్ మట్టి ప్రాంతాన్ని బట్టి రూ. 1200 నుంచి 2 వేల వరకు ధర పలుకుతుంది. బయటకు తీసిన మట్టిని ఛానల్ ఆవలివైపు ఉన్న యనమదుర్రు డ్రెయిన్ పటిష్టకు వినియోగిస్తే బాగుండేదని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రతి ఏటా అదే ప్రాంతంలో యనమదుర్రు డ్రెయిన్‌కు వరద పోటు వచ్చినప్పుడు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కంటిమీద కునుకు లేకుండా లక్షలాది రూపాయలు వెచ్చించి దూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లపై వందలాది మట్టి బస్తాలతో యనమదుర్రు కరకట్టను పటిష్టం చేస్తారు. ఇరిగేషన్ అధికారులు ప్రస్తుతం తీసిన మట్టిని ఒకచోట వేస్తే వర్షాకాలంలో మట్టిబస్తాలకు, యనమదుర్రు డ్రెయిన్ కరకట్టకు పటిష్టకు ఉపయోగపడుతుందని పలువురు రైతులు చెబుతున్నారు. జేసీబీతో మట్టి తీసేటప్పుడు ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్ సిబ్బంది లేకపోవడంతో ఇష్టానుసరంగా తీసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఆర్అండ్‌బీ రోడ్డు వైపు మట్టి వల్ల వాహనాలు జారిపడిపోతాయని ప్రజా ప్రతినిధి తీసి వేయమన్నారని తీసేస్తున్నామని చెప్పడం గమనార్హం.

శక్తి యాప్‌పై అవగాహన

భీమవరం: మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసు శాఖ అభివృద్ధి చేసిన శక్తి మొబైల్ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చునని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీషా తెలిపారు. శక్తి యాప్‌పై అవగాహనలో భాగంగా గురువారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవాహన కల్పించారు. శక్తి బృందాలు భీమవరంలోని స్థానిక పాసుపోర్టు కార్యాలయం, ఓల్డ్ బస్ స్టేషన్, మావుళ్ళమ్మ గుడి సెంటర్, అదేవిధంగా జిల్లాలోని పాలకొల్లు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్ , తాడేపల్లి గూడెం టౌన్, పాలకొల్లు టౌన్, పోడూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, ప్రముఖ షాపింగ్ మాల్స్, మూవీ థియేటర్స్‌లో అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా ఇన్విటేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్

భీమవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో గురువారం భీమవరం పట్టణంలోని ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో ఇన్విటేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనసూయ చెస్ అకాడమీ కోచ్ మాదాసు కిషోర్ మాట్లాడుతూ టోర్నమెంట్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు అండర్ ఫైవ్, అండర్ సెవెన్, అండర్ నైన్, అండర్ 11, అండర్ 13, అండర్ 15, చిన్నారులకు ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన క్రీడాకారులకు మొక్కలు పంపిణీ చేశారు.